తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం



కోట, మే 23 ప్రభాతవార్త: ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ శాఖ సన్నద్ధమైంది. తొలకరి వర్షాలు పడటం, రుతుపవనాలు ముందస్తుగా వస్తుండటంతో అందుకు అనుగుణంగా పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వేసవి దుక్కులతో చాలా ప్రాంతాల్లో సందడి కనిపిస్తోంది. కొన్నిచోట్ల పచ్చిరొట్ట పైర్ల సాగు ఇప్పటికే ప్రారంభమైంది. ఖరీఫ్ సీజన్‌లో ముందుగా విత్తనాలు నాటుకుంటే నవంబర్, డిసెంబర్ నెలల్లో సంభవించే తుపానుల నుంచి బయటపడవచ్చన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. రైతులు ముందస్తుగా పంటల సాగును ప్రారంభిస్తే ఒనగూరే ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఈ ఏడాది విత్తన ప్రణాళికను ముందుగానే వేగవంతం చేసింది. రాయితీ మొత్తాన్ని, విత్తనాల ధరలను ఖరారు చేసింది. ఇందులో భాగంగా చిరుధాన్య పంటల విత్తనాలకు 50 శాతం రాయితీ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ నుంచి జిల్లా కార్యాలయాలకు సమాచారం అందింది. రైతులకు సకాలంలో విత్తనాలు అందుబాటులో ఉండేలా విత్తన పంపిణీ వేగవంతం చేయాలని ఆదేశించింది. జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను కలిపి ఒకే కిట్‌గా పంపిణీ చేస్తున్నారు. దీనికి 50 శాతం రాయితీ అందిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరిపంట సాగు చేసే రైతులు పచ్చిరొట్ట విత్తనాలను వెంటనే చల్లుకోవాలని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

## అభివృద్ధి, సంక్షేమం...
# చంద్రబాబుకు రెండు కళ్లు

**- ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లో తీసుకెళ్లాలి-ఘనంగా మినీ మహానాడు**





మినీ మహానాడులో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ కంచర్ల

కుప్పం, మే 23 ప్రభాతవార్త : అభివృద్ధి, సంక్షేమం సిఎం చంద్రబాబు నాయుడుకు రెండు కళ్లు అని ప్రభుత్వ విప్, కుప్పం తెదేపా సమన్వయ కమిటీ ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం అధ్యక్షతన కుప్పంలో తెదేపా నియోజకవర్గస్థాయి మినీ మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ పరంగా తాము ఎవరైనా తప్పు చేస్తే తమను ప్రశ్నించవచ్చున్నారు. ఫలానావారు ఇలా చేశారంట అలా చేశారంట అనే అంట మాటలు మానుకోవాలని సూచించారు. ఇది పార్టీకి కూడా మంచిది అన్నారు. పార్టీ పరంగా పదవుల కేటాయింపు బాధ్యత ముఖ్యమంత్రే చూసుకుంటారని ఎవరి సిఫార్సుల వల్ల పదవులు రావని ఆయన పేర్కొన్నారు. పార్టీలో కష్ట పడే వారికి మంత్రి నారా లోకేష్ తప్పక గుర్తింపు ఇస్తారన్నారు.

**కుప్పం ప్రజల భవిష్యత్తుకు సిఎం చొరవ :**

ఎనిమిదిసార్లుగా తనను గెలిపిస్తున్న కుప్పం ప్రజల భవిష్యత్తు కోసం సిఎం చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నారు. కుప్పం అభివృద్ధికి ఫలానా కావాలి అంటే కాదనకుండా మంజూరు చేస్తున్నారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం జననాయకుడు పోర్టల్‌ను పెట్టారని అక్కడ ఫిర్యాదు చేస్తే నేరుగా సిఎంకు ఫిర్యాదు చేసినట్లేనన్నారు. కుప్పంలో 50వేల ఇళ్లకు ఉచితంగా సూర్యఘర్ పథకంలో సోలార్ కనెక్షన్లు, ఉపాధిహామీలో 30కోట్లతో సిసి రోడ్లు, 53కోట్లతో ఆర్అండ్‌బి రోడ్లు, 600కోట్లతో హంద్రీ-నీవా పనులు, 113కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైన్లు మంజూరు చేశారన్నారు. కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు 16లక్షల మేర చెల్లించాలని సిఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారన్నారు. 11 ఆలయాలకు 53కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. పాడి రైతులకు 1500గోకులం షెడ్లు మంజూరుకు ఆదేశించారన్నారు. అనంతరం మహానాడులో 9 తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, టిటిడి బోర్డుసభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, బాబు, ఆనందరెడ్డి, విశ్వనాథనాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సుధీర్, మాజీ ఎంపిపిలు సాంబశివం, వెంకటేష్, కౌన్సిలర్లు, నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మళ్లీ కోవిడ్ కలకలం!

**- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజానీకం**



చిత్తూరు, మే 23 ప్రభాతవార్త: గతంలో రెండేళ్ళపాటు జిల్లా ప్రజానీకంను వణికించి అనేక మందిని పరలోకాలకు తీసుకెళ్ళిన కరోనా వైరస్ జాడలు మళ్ళీ కన్పిస్తున్నాయని విస్తృతంగా ప్రచారం జరుగుతుండటంతో మరోసారి ప్రజలు వణికిపోతున్నారు. దేశ వ్యాప్తంగా గత వారం రోజులుగా కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నాయని ప్రచార మాధ్యమాల్లో చెప్తుండటంతో జిల్లా ప్రజానీకంలో భయాందోళనలు నెలకొన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని చోట్ల ఇప్పటికే కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నాయని ప్రచారం జరుగడంతో ప్రజల్లో కలకలం ఏర్పడింది. వైద్య విజ్ఞానం కొత్త పుంతలు తొక్కి ఎలాంటి వ్యాధి వచ్చిన క్షణాల్లో వైద్యం అందించడానికి మందులు వున్నాయని చెప్పుకుంటున్న సమయంలో కరోనా వైరస్ రూపంలో మనిషిని వణికించే వ్యాధి వచ్చింది. దేశ వ్యాప్తంగా కరోనా వైరస్ విజృంభించడంతో ఈ వ్యాధిని నయం చేయడానికి మందులు లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు ఏడాది పాటు దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో ఇప్పటి వరకు కరోనా వైరస్ జాడలు కన్పించకపోయినప్పటికీ గతంలో కరోనా వైరస్ సృష్టించిన భయానక వాతావరణంను గుర్తించుకుని మళ్ళీ కరోనా వైరస్ విజృంభిస్తే పరిస్థితి ఏమిటని జిల్లా ప్రజానీకం భయాందోళనలు చెందుతుంది. జిల్లాలో కరోనా వైరస్ మరోసారి విజృంభించకుండా క్షేత్ర స్థాయిలో వైరస్‌ను కట్టడి చేయడానికి ఇప్పటి నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పక్కా ప్రణాళిక రచించి అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

# కోవిడ్‌పై ముందస్తు జాగ్రత్తలు

**- కమీషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్**



కమీషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ జూమ్ కాన్ఫరెన్స్‌కు హాజరైన డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, వైద్యాధికారులు

చిత్తూరు, మే 23 ప్రభాతవార్త: ప్రక్క రాష్ట్రాల్లో కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు అవుతున్న పరిస్థితుల్లో ప్రజలకు వైద్యశాఖ ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కమీషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణిని ఆదేశించారు. కమీషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్ శుక్రవారం డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, ప్రోగ్రాం ఆఫీసర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కోవిడ్ పాజిటివ్ కేసులపై ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఇహెచ్‌ఆర్ ఎంప్లాయిస్ హెల్త్ రికార్డులపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు పిహెచ్‌సికి వచ్చేటపుడు ఆధార్ కార్డుతో వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, తద్వారా వెనుకటికి చికిత్స సులభతరం అవుతుందన్నారు. హైరిస్క్ కేసులను మాత్రమే జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేయాలని, అలాగే ఆర్‌సిహెచ్ ఐడికి ఆభ ఐడి తప్పని సరిగా వంద శాతం లింక్ చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డిఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనుష, రామ్మోహన్, ప్రసాద్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ 'మాస్కు' వేయాల్సిందే !

**-గుంపులుగా ఉండొద్దని హెచ్చరికలు -పార్టీలు,ఫంక్షన్లు చేయొద్దు -వైద్యఆరోగ్యశాఖ ముందుజాగ్రత్తలు**

**ప్రభాతవార్త-తిరుపతి:**

రాష్ట్రంలో మళ్ళీ కోవిడపాజిటివ్ కేసులు నమోదవడంతో ముందు జాగ్రత్తగాప్రతి ఒక్కరూ "మాస్క్" ధరించాల్సిందేనని వైద్యఆరోగ్యశాఖ సూచించింది. గత నాలుగేళ్ళ క్రిందట కోవిడ్ వ్యాప్తిచెంది ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. ఈ దఫా కోవిడ్‌ను తొలిదశలోనే కట్టడి చేయడంతో బాటు నియంత్రించేందుకు ప్రజలు తప్పనిసరిగా కొన్ని నిబంధనలు పాటించాలని సూచించింది. యాత్రాస్థలం, పుణ్యక్షేత్రాల్లో భౌతికదూరం పాటించడం, తప్పనిసరిగా మాస్క్ ధరించడం చేయాలి. ఇప్పటికే రాష్ట్రంలో విశాఖ, కడపజిల్లాల్లో మూడు కేసులు నమోదైనట్లు తెలుస్తున్నా ప్రజలు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో బాటు గుంపులుగా చేరొద్దని, దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్ళి పరీక్షలు చేయించుకోవాలని తెలిపింది.

శుక్రవారం ప్రభుత్వం నుండి కూడా తగిన సూచనలు, ఆదేశాలు వెలువడటంతో ప్రజలు కొద్దిరోజులు గుంపులుగా పార్టీలు, ఫంక్షన్లు, ప్రార్థనలు వంటి కార్యక్రమాలు నిర్వహించొద్దని పేర్కొంది.. రైల్వేస్టేషన్, బస్టాండులు, విమానాశ్రయాలు, ఆలయాల వద్ద మాస్కులుధరిచడం, దూరంగా ఉండటం తప్పనిసరి అని తెలిపింది. 60ఏళ్ళు పైబడిన పెద్దవాళ్ళు, గర్భవతులు ఇంట్లోనే ఉండాలని, బయటకు రావొద్దని హెచ్చరించింది. చేతులు తరచూ కడుక్కోవాలని, దగ్గు, తుమ్మువస్తే నోరు కప్పుకోవాలని, చేతులు అడ్డం పెట్టుకుని ముఖానికి తాకకుండా చూడాలి. మాస్క్ తప్పనిసరిఅని, బహిరంగ ప్రాంతాల్లో ఎక్కువమంది ఉన్న చోట మాస్క్ ధరించడం చాలా అవసరమని, జ్వరం, దగ్గు, గొంతనొప్పి ఉంటే వెంటనే కోవిడ్ పరీక్ష చేయించుకోవాలని సూచించింది. విదేశాల నుండి వచ్చిన వాళ్ళు తప్పకుండా కోవిడ్ పరీక్ష చేయించుకోవాలని, అనారోగ్యంగా ఉంటే ఇంట్లోనే ఉండాలని, బయటకు రాకూడదని, ఇతరులకు వ్యాపించకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని వైద్యాధికారులు, వైద్యశాలల్లో అవసరమైన మందులు, మాస్క్‌లు, పిపిఈ కిట్లు, ట్రిపుల్‌లేయర్ మాస్క్‌లు అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. 24గంటలూ పరీక్షలు సదుపాయం ఉండే ల్యాబ్‌లు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది.

# గంగరాకతో రైతుల కళ్ళలో ఆనందం

**-గంగ కాలువలో 1200 క్యూసెక్కుల నీరు విడుదల -రెండో పంటకు తప్పిన ఇబ్బందులు**



గంగ కాలువలో నిండుగా ప్రవహిస్తున్న నీటి దృశ్యం

తొట్టంబేడు, మే 23 ప్రభాతవార్త : గత ఏడాది అకాలవర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు ఈఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంటుందని అకున్నారు. అయితే కండలేరులో నీరు సమృద్ధిగా ఉండడంతో అందరికీ రైతులకు నీరందించే తెలుగుగంగ కాలువలో నీళ్ళు నిండుగా ప్రవహిస్తూ కాలువ కళ కళ లాడుతోంది. ఈనేపథ్యంలో అన్నదాతల పంటలకు ఊపిరి వచ్చినట్లు అనిపిస్తోంది. పంటలు చేతికి వస్తాయా?లేదా? అనుకుంటున్న తరుణంలో గంగ కాలువలో నీటిని విడుదల చేయడంతో అన్నదాతల ఆనందానికి అవధులు లేకుండా పోతోంది. ఇన్నాళ్ళు గంగ కాలువలో నీటి కోసం నిరీక్షిస్తున్న రైతన్నలకు ఒక్కసారిగా కండలేరు నుంచి గంగ కాలువకు 1200 క్యూసెక్కులు నీటిని విడుదల చేయడం గమనార్హం. మంత్రులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే గంగ కాలువలో నీటిని విడుదల చేశామని ఈఈ రత్నాకర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగ కాలువలో ప్రస్తుతం 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని అయితే ప్రస్తుతం చెన్నైకు మాత్రం350క్యూసెక్కుల నీటినివిడుదల చేశామన్నారు. పంటలకు ఇంకా నీటిని విడుదల చేయలేదని గత జనవరిలోనే వర్షాలు ఎక్కువగా పడడంతో చెరువుల నిండడం వల్ల నీటిని కొరత లేదని చెన్నైకు నీరు ఇచ్చిన తర్వాత గ్రామాల్లోని చెరువులకు నీటిని విడుదల చేస్తామన్నారు. గంగ నీటి కోసం నాయుడుపేట, సూళ్ళూరుపేట, వాకాడు, కోట, తదితర ప్రాంతాల రైతులతో పాటు తొట్టంబేడు మండలంలో నుంచి ప్రారంభమయ్యే రాంబట్లపల్లి నుంచి చెన్నైలోకి పూండి కాలువ వరకు నీటిని అందిస్తున్నామన్నారు. ఏడో బ్రాంచి కాలువకు కూడా 250 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నామన్నారు. తిరుపతి తాగునీటికోసం ప్రతిరోజు 60 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నామని శ్రీకాళహస్తి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుకు కూడా రోజు 25 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా తొలుత తాగునీటి అవసరాల కోసం నీరు వాడుకోవాలన్నారు. తాగునీటి అవసరాలు తీరిన తర్వాత చెరువులకు రెండో పంటకు నీరు అందిస్తున్నారు. గంగ కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ఎవ్వరు నీటిలో దిగి స్నానం చేయడం, గట్టుపై దుస్తులు ఉతకడం చేయరాదని హెచ్చరించారు.

**ఖరీఫ్‌కు ఇబ్బందులు లేవు..ఏడిఏ**

ఖరీఫ్ పంటకు రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు లేవని సహాయ వ్యవసాయశాఖ సంచాలకులు రమేష్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో వరి పంట 7949హెక్టార్లలో సాగుచేయాల్సి ఉండగా ప్రస్తుతం 1204 హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయని, ఇక వేరుశనగ 1778 హెక్టార్లలోను, కెవిబిపురం మండలంలో వేరుశనగ కొంతశాతం మాత్రమే వేశారన్నారు. ఈనెలాఖరుకు వరి నాట్లు పూర్తవుతాయన్నారు.

# అమరావతి నిర్మాణానికి లక్షల కోట్లు ఎక్కడవి!

**అమరావతి సక్సెస్ కాదు... కృష్ణా నదిలో రాజధాని కట్టుతున్నారు - మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతా మోహన్**




ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతా మోహన్

గూడూరు, మే 23 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని విషయంలో పొరపాటు చేస్తున్నాడని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతా మోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష కోట్లు ఖర్చు పెట్టాలనుకుంటున్నాడు. ఆ డబ్బు ఎవరిది అని ప్రశ్నించారు. బ్యాంకుల నుంచి అప్పు తెస్తున్నాడు. అమరావతిలో ఒక బిల్డింగ్ నిర్మాణానికి పదింతలు అదనపు ఖర్చు అవుతుందని, సెక్రటేరియట్ కోసం 50 అంతస్తుల భవనాన్ని కట్టాలనుకుంటున్నారు. భవిష్యత్తులో ఆ బిల్డింగ్ కూలిపోతే బాధ్యత ఎవరు వహిస్తారని అన్నారు. అమెరికాలో వాషింగ్టన్, మలేషియాలో, అలాగే ఆస్ట్రేలియాలో ఒక మహా నగరాన్ని కట్టాలని ఫెయిలయ్యారు. ఒక మహా నగరాన్ని కట్టేముందు అందరి సలహాలు తీసుకోవాలన్నారు. మేధావులతో సంప్రదించాలి, చర్చించాలి అని అన్నారు. సొంత నిర్ణయాలు వొద్దు, మొండిగా ముందుకు వెళ్లవద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. శివరామ కృష్ణన్ కమిటీ సిఫార్సులో ఏముందని, అమరావతిలో కట్టమని కమిటీ చెప్పలేదు. పేదరికం గురించి ముఖ్యమంత్రి మాట్లాడటం హాస్యాస్పదం. 2029 నాటికి పేదరికాన్ని తీసేస్తానని ముఖ్యమంత్రి అంటున్నారన్నారు. 15 ఏళ్ళు ముఖ్యమంత్రిగా పనిచేసిన మీరు పేదరికాన్ని ఎంతవరకు తగ్గించగలిగారన్నారు.

**- మేజర్ పోర్టు ప్రారంభించాలి**

దుగరాజ పట్టణ మేజర్ పోర్టును కాంగ్రెస్ పార్టీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇచ్చారు. మోడీ, బాబు ఇరువురూ కలిసి గూడూరు ప్రజల చెవిలో పూలు పెడుతున్నారు. గూడూరు ప్రజలకు కావాల్సింది దుగ్గరాజ పట్టణం మేజర్ పోర్ట్ నిర్మాణం, కూటమి ప్రభుత్వం ఇచ్చింది నౌకల నిర్మాణ కేంద్రం, దుగరాజ పట్టణం మేజర్ పోర్ట్ పూర్తయితే, వందల సంఖ్యలో పరిశ్రమలు వస్తాయి. నిరుద్యోగులకు మంచి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీతి అయోగ్ దగ్గర మేజర్ పోర్ట్ గురించి ప్రస్తావించాల న్నారు. ఇది ఆయన బాధ్యత అని అన్నారు. 11 సంవత్సరాల క్రితం తన బంధువుకు సాయం చేసేదాని కొరకు జాబు రాసి, దుగరాజపట్నం పోర్టును ఆపాడు. ప్రపంచంలోనే 5 వ అతి పెద్ద పోర్టును కాంగ్రెస్ పార్టీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ విభజన చట్టంలో ఇవ్వడం జరిగిందన్నారు. అమెరికా, ఇంగ్లాండ్ లో ఇటువంటి పోర్టు ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న గనులు, ఇసుక, క్వార్జ్ ఖనిజ సంపద కొందరే దోచుకుంటున్నారు. ఒక కిలో క్వార్జ్ రూ. 10 వేల రూపాయలు, ఒక ట్రాక్టర్ ఇసుక 10 వేల రూపాయలు, గనులు సహజ సంపద. సహజ సంపద అందరికీ సమానంగా పంచాలన్నారు. నిరుద్యోగ బ్రాహ్మణులు, ఎస్సీ, ఎస్టీ ఓబీసీ, మైనార్టీలకు ఇసుక, క్వార్జ్, ఖనిజ సంపద గనులు కేటాయించాలన్నారు. రహస్యంగా ప్రకటనలు ఇస్తున్నారు. దీన్ని నేను ఖండిస్తూ ప్రతి మండలంలో అందరికీ అందుబాటులో పేపర్లలో ప్రకటనలు ఇవ్వాలని, దరఖాస్తుకు సమయం ఇవ్వాలని గూడూరు టవర్ క్లాక్ దగ్గర కాంగ్రెస్ ధర్నా చేసారు. సబ్ కలెక్టర్ ఆఫీస్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రామకృష్ణ, వెంకటయ్య, చందనమూడి శివ, పెంచులయ్య, పూల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల మరమ్మతులు

**-అంచనాల తయారిలో అధికారులు -ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు**





ఆవరణను పరిశుభ్రం చేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, మే 23 ప్రభాతవార్త : సుమారు 8 సంవత్సరాలుగా మూత పడ్డ స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారంభానికి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధికారులను పరుగులు తీయిస్తున్నారు. ఈ కళాశాలను అనంతపురానికి సంబంధించిన జేయన్‌టియుకు అప్పగించుటకు ప్రభుత్వం నిర్ణయించింది. మొదట మూడేళ్ళ పాటు దేవస్థానం నిధులను వెచ్చించుటకు తరువాత జేయన్‌టియు తిరిగి చెల్లించేందుకు ప్రతిపాధించారు. అయితే రాష్ట్ర సాంకేతిక, ఉన్నత విద్యాశాఖామాత్యులు నారా లోకేష్ యువగళంలో పాద యాత్ర సందర్భంగా తిరిగి ప్రారంభించుటకు భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రస్తావన వచ్చినపుడు నారాలోకేష్ కళాశాలను పూర్తిగా మరమ్మత్తులు చేసి అప్పగించుటకు ప్రభుత్వమే నిధులు మంజూరు చేస్తారని భరోసా ఇచ్చారు.

**కంప్యూటర్లు తుప్పు పట్టాయి:**

సుమారు 8 సంవత్సరాల నుంచి మూత పడ్డ ఇంజనీరింగ్ కళాశాలలో పరిస్థితుల్ని గమనించిన ఇంజనీర్లు అవాక్కయ్యారు. కోట్ల రూపాయల విలువ కల్గిన కంప్యూటర్లు తుప్పు పట్టాయి. ఆశ్చరకరమైన విషయం ఏమిటంటే ఈ కళాశాలను పర్యవేక్షించిన వారు. తలుపులకు కనీసం తాళాలు కూడా తగలించకపోవటం గమనించదగ్గ విషయం, అంతేకాక విలువైన ఫర్నీచర్, దెబ్బతినగా పుస్తకాలు బూజుపట్టి ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కళాశాల భూముల విలువ సుమారు రూ. 250కోట్లు. అలాగే భవనాల విలువ రూ. 30కోట్లుగా అంచనా కట్టారు. అయితే పూర్తి స్థాయి మరమ్మత్తులకు రూ. 5కోట్లు అవసరమౌతుందని ప్రాథమిక అంచనాలు. ఇఇ మురళీధర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇంజనీర్లు అంచనాల తయారిలో తలమునకలై ఉన్నారు. ఇప్పటికే ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించారు. భవనాల బూజు దులిపి ముస్తాబు చేస్తున్నారు.

# సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్, ఎక్విప్‌మెంట్‌పై సమీక్షించిన జిల్లా కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, మే 23 ప్రభాతవార్త : రుయా ఆస్పత్రి నందు నూతనంగా నిర్మించిన సిటీ డయాగ్నోస్టిక్ సెంబర్, ఎక్విప్‌మెంట్‌పై సంబంధిత వైద్య అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్ధేశం చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని మిని సమావేశ మందిరం నందు రుయా ఆస్పత్రి నందు నూతనంగా నిర్మించిన సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్, ఎక్విప్‌మెంట్‌పై సంబంధిత వైద్య అధికారులతో సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు కావాల్సిన ఎక్విప్‌మెంట్, ఖర్చులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ రుయా ఆస్పత్రి నందు 134 రక్త, మూత్ర, ఇతర ముఖ్యమైన పరీక్షలకు 60 టెస్టులు నిర్వహిస్తున్నామని ఇంకా 74 టెస్టులు పరీక్షలు నిర్వహించుటకు కావాల్సిన ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందులో 15 టెస్టులకు సంబంధించి అదనంగా ఎక్విప్‌మెంట్ కిట్ అవసర ముందని తెలిఎపారు. ఈ సమావేశంలో రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు, వైస్ ప్రిన్సిపాల్స్ బయో కెమిస్ట్రీ, పెథాలజీ, మైక్రోబయాలజీ, రేడియాలజీ, హెచ్ఓడీలు, ఏపీ మెడికల్ సర్వీస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇంజనీరింగ్ విభాగ అధికారులు పాల్గొన్నారు.

## ముస్తాబవుతున్న ముఖ్యమంత్రి నివాసం

**శాంతిపురం, మే 23 ప్రభాతవార్త :**



మండలంలోని కదిరి ఓబనపల్లి వద్ద సిఎం చంద్రబాబు నాయుడు సొంత ఇల్లు గృహ ప్రవేశంకు ముస్తాబవుతోంది. ఇంటి పరిసర ప్రాంతాలను చదును చేయడం, కార్యక్రమానికి వచ్చే అతిథులు, ప్రజల కోసం పార్కింగ ఏర్పాట్లు, భోజన వసతి సౌకర్యాలు తదితరాలు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారు. ఈనెల 25వతేది సిఎం చంద్రబాబునాయుడుతో సహా కుటుంబీకులు అందరూ గృహ ప్రవేశంకు హాజరు కానున్నట్లు సమాచారం.

## సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్



**శాంతిపురం/వి.కోట, మే 23 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు ఈనెల 24-26 తేదీల్లో కుప్పంలో పర్యటించనున్న నేపథ్యంలో శుక్రవారం సిఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుతో కలసి పరిశీలించారు. 25న శాంతిపురం మండలం కదిరి ఓబనపల్లి వద్ద సిఎం సొంత ఇంటి గృహ ప్రవేశం కార్యక్రమంకు సంబంధించి భద్రత ఏర్పాట్లు,రూట్ మ్యాప్ పరిశీలించారు. సిఎం నివాసం, ద్రవిడ వర్సిటీ హెలిప్యాడ్ పరిశీలించారు. వి.కోట - కుప్పం మార్గంలో చెట్ల పొదలు తొలగింపు, పారిశుద్ధ్య పనులు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ డిపిఓనుఎ ఆదేశించారు. సిఎం నివాస గృహం వద్ద వాహనాల పార్కింగ్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు ఆరోగ్యశాఖ బృందం ఉండాలన్నారు. పటిష్ట బారికేడింగ్ ఏర్పాటుకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్పీ నంద కిషోర్, ఎస్ఇ చం ద్రశేఖర్‌రెడ్డి, ఆర్డీఒలు శ్రీనివాసులు రాజు, భవాని, డిపిఒ సుధాకర్‌రావు, ఎఆర్ డిఎస్పీ మహబూబ్ బాషా, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి ఎన్ఎంయుఎ కృతజ్ఞతలు



**కుప్పం, మే 23 ప్రభాతవార్త :** ఆర్టీసీ ఎన్ఎంయుఎ ఉద్యోగులు రాష్ట్రస్థాయిలో జరిపిన నిరసనలకు అనుకూలంగా సర్క్యులర్ 1/2019ను అనుసరించి చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం అధికారుల్ని ఆదేశించడంతో కుప్పం డిపోలో ఎన్ఎంయుఎ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం గేట్ మీటింగ్‌ను డిపో కార్యదర్శి జయపాల్, జాయింట్ కార్యదర్శి మునెప్పల అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయక్, రాజా, దిలీప్‌కుమార్, బ్రహ్మం, జయశంకర్, చంద్ర, ఉద్యోగులు పాల్గొన్నారు.

## విశేష్ ఆలంకరణలో ఆంజనేయస్వామి



**చౌడేపల్లి, మే 23 ప్రభాతవార్త :** ఆంజనేయస్వామి ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితుడు సత్యనారాయణశర్మచే ఉదయాన్నే స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. గురువారం రాత్రి ఆంజనేయస్వామి ఉత్స వ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు. రాజనాలబండపై టిటిడి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా స్థానిక హరిమందిరం, గడ్డంవారిల్లి, కరణంవారిపల్లి, పుదిపట్ల వైష్ణవీదేవీ ఆలయం, నడుమూరు తదితర ప్రాంతాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

## ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాం రక్షణ కల్పించండి!



**చౌడేపల్లి, మే 23 ప్రభాతవార్త:** ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాం రక్షణ కల్పించాలంటూ ఓ ప్రేమ జంట స్థానిక పోలీసులను ఆశ్రయించింది. వారి కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం ఆమినిగుంటకు చెందిన రమేష్ కుమారుడు ప్రేమ్‌కుమార్ డిగ్రీ పూర్తి చేసుకొని చిన్నచిన్న పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో పెద్దపంజాని మండలం రాయలపేట తాయారమ్మ కాలనీకి చెందిన లక్ష్మీప్రియతో పరిచయం అయ్యింది. ప్రస్తుతం లక్ష్మీప్రియ కుప్పంలో బి.టెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. వీరిద్దరూ పరస్పరం ప్రేమించుకొంటున్నారు. తమ ప్రేమ వ్యవహారం ఇంట్లో తెలిసి వివాహం చేయాలనుకొంటున్నారనీ, తనకు నచ్చిన ప్రేమ్‌కుమార్‌ను పెళ్ళి చేసుకొన్నట్లు లక్ష్మీప్రియ తెలిపింది. కులాంతర వివాహం చేసుకొన్నామని ఇరుకుటుంబాల్లోని పెద్దల నుంచి రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించామన్నారు. కాగా కుప్పంలో యువతి మిస్సింగ్ కేసు నమోదు చశారనీ, వారిద్దరినీ కుప్పంకు తరలించినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

## 25న ఉచిత ఆయుర్వేద ఆరోగ్య శిబిరం

**చౌడేపల్లి, మే 23 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌడేపల్లిలో ఈనెల 23న ఉచిత ఆయుర్వే ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సత్సంగ్ పౌండేషన్ (ఆరోగ్యం దిసెక్రెడ్ గ్రోవ్) పెద్దకొండామర్రి వారు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే ఈ శిబిరంలో వైద్య పరీక్షలు ఉచితంగా వుంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఘనంగా శ్రీ మాతమ్మ విగ్రహప్రతిష్ట కార్యక్రమం



**పెద్దపంజాణి మే23 ప్రభాతవార్త:** మండలంలోని కోగిలేరు పంచాయతీ బసవరాజుకండ్రిగ గ్రామంలో నూతనంగా శ్రీ మాతమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించడంతో పాటు కుంభాభిషేక కార్యక్రమం,శ్రీ బాట గంగమ్మ ఆలయ ప్రారంభోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం నిత్య కళశారాధన,ప్రాణ ప్రతిష్ట, సర్వకళాహోమం, అమ్మవారికి ప్రధానహోమం,కుంభాభిషేక కార్యక్రమం, గోపూజ, గోదర్శనం, బళి, మహ మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాలకు తిలకించేందుకు హాజరైన భక్తాదులు సుమారు 2వేల మందికి నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు.

## దేశం పంచాయతీ ఇన్చార్జిల నియామకం

**పుంగనూరు రూరల్, మే 23 ప్రభాతవార్త :**



మండలంలో పలు పంచాయతీలకు పార్టీ ఇన్చార్జిలను శుక్రవారం నియమిం చారు. మండల పార్టీ ప్రెసిడెంట్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో పలు పంచాయతీలకు అధ్యక్షు లను నియామక మయ్యారు. భీమగాని పల్లి, మోదుగులపల్లి మిట్ట చింతవారిపల్లి నేతిగుట్లపల్లి చంద్ర మకులపల్లి పాలెంపల్లి సుగాలి మిట్ట నల్ల గుట్లపల్లి తండా, బోడెవారిపల్లి పంచాయితీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర, రమణ, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణనాయక్, రామకృష్ణ నాయక్, సుబ్రహ్మణ్యం, సోము, రాంబాబు, హరి, మంజునాథ్, మధు, వెంకటరమణ, కోలాట వెంకటరమణ, బాబు నాయక్, రూపేంద్ర నాయక్, తెలుగుదేశం కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## హాకింగ్స్ పాఠశాల కొనసాగుతుంది!



**కుప్పంరూరల్, మే 23 ప్రభాతవార్త :** కుప్పం సమీపంలో ఉన్న హాకింగ్స్ పాఠశాలను ప్రభుత ్వం రద్దు చేయలేదని 8-10తరగతులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు రద్దు చేశారని స్కూల్ ఛైర్మన్ హఫీజ్ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం ప్రాంతంలో మంచి నాణ్యమైన విద్య అందించాలనే ఆశయంతో తాను పాఠశాల స్థాపించారన్నారు. 2023నుంచి 2031వరకు తాము 8-10తరగతుల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అయితే ఉన్నతాధికారులు తమ పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు రద్దు చేశారన్నారు. తమ పాఠశాలలో సిబిఎస్ఇ సిలబస్‌ను ఏడవ తరగతి దాకా కొనసాగిస్తామని అందుకు అనుమతులు ఉన్నాయన్నారు. పాఠశాల నిర్వహణ కొనసాగుతుందని అందులో ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ షబ్బీర్ పాల్గొన్నారు.

## 25న బడుగుమాకులపల్లి వారపుసంత రద్దు

**శాంతిపురం, మే 23 ప్రభాతవార్త :** మండలం బడుగుమాకులపల్లిలో ప్రతి ఆదివారం జరిగే వారపు సంతను ఈనెల 25న అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు సర్పంచ్ ఎవి జయరాం, కార్యదర్శి అశ్వత్ నారాయణ తెలిపారు. మరలా సంతరోజు ఈనెల 28వతేది నిర్వహిస్తామన్నారు. వ్యాపారులు, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

## వేలాది రూపాయల యంత్రం నిరుపయోగం!



**పలమనేరు,మే 23 ప్రభాతవార్త:** వేలాది రూపాయలు విలువ చేసే జెనరేటర్ యంత్రం స్థానిక పాత రెవెన్యూ కార్యాలయం వద్ద నిరుపయోగంగా పడిఉంది. 2019 వైకాపా ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలకు పట్టణంలో నూతన రెవెన్యూ భవనంలో రెవెన్యూ అధికారులు వారి కార్యకలాపాలను ప్రారంభించారు. పాత రెవెన్యూ కార్యాలయంలోని కంప్యూటర్లు,కార్యాలయ ఉపకరణాలను తరలించిన అధికారులు వేలాది రూపాయలు విలువచేసే జెనరేటర్ యంత్రాన్ని తరలించడం మరచిపోయారు.దీంతో నూతన భవనంలో కార్యకలాపాలు ప్రారంభించి సుమారు 5 సంవత్సరాలు కావస్తున్నా ఆ జెనరేటర్ యంత్రం పాత రెవెన్యూ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉండి పోయింది.ఇటీవల కురిసిన వర్షాలకు జెనరేటర్ యంత్రం సమీపంలో ఉన్న ప్రహరిగోడ ఆ యంత్రం పై పడడంతో యంత్రం పాక్షికంగా దెబ్బతింది.ప్రహరీ గోడ యంత్రపై పడి సుమారు వారం కావస్తున్నప్పటికి ఇప్పటి వరకు ఆ యంత్రంపై పడి ఉన్న ప్రహరిగోడను అధికారులు తొలగించలేదు.ప్రస్తుతం నూతన రెవెన్యూ కార్యాలయానికి ఆ జెనరేటర్ యంత్రంతో పని లేకపోవడంతో అలా వదిలేసారనుకున్నా..వేలాది రూపాయలు విలువ చేసే ఆ యంత్రాన్ని కనీసం భద్రపరిచే బాధ్యత అధికారులపై లేదా అన్న విమర్శలు లేకపోలేదు.

## వ్యవసాయంలో సాంకేతికతో అధిక లాభాలు



**వెదురుకుప్పం, మే 23 ప్రభాతవార్త :** వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వాడటం వలన అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి వనిత పేర్కొన్నారు. మండలంలోని వెదురుకుప్పం రైతు బరోసా కేంద్రంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్కిల్ అఫ్ చిత్తూరు కార్యక్రమంలో భాగంగా రైతులకు సాంకేతిక వ్యవసాయం పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆధునిక డిజిటల్ నైపుణ్యం, వ్యవసాయం పై పరిజ్ఞాన పెంచుకోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.గ్రామ వ్యవసాయ సహాయకులు బి. దయాకర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చార్జింగ్ కేంద్రంగా మారిన వెలుగు కార్యాలయం



**పూతలపట్టు, మే 23 ప్రభాతవార్త:** మండలం వెలుగు కార్యాలయం నందు విద్యుత్ వాహనాలకు చార్జింగ్ పెట్టుకోవడం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే విద్యుత్‌ను దుర్వినియోగం చేయడం జరుగుతున్నది. ప్రభుత్వ అధికారులే కాకుండా అధికారుల కోసం వచ్చే వారి బంధుగణాలకు కూడా చార్జింగ్ పెట్టుకోవడం ఆనవాయితీగా మారుతున్నది. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకి ప్రభుత్వానికి మధ్య వారధిగా నడవాలే కానీ స్వలాభాల కోసం స్వప్రయోజనాల కోసం నడవకూడదని సామాన్య ప్రజలు వాపోతున్నారు.

## వివాహిత ఆత్మహత్య!



బంగారుపాళ్యం, మే 23 ప్రభాతవార్త: తనకు పిల్లలు కలగలేదని తరచు భర్త, అత్త వేధింపులు తాళలేక జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత శుక్రవారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. ఈ సంఘటనపై స్థానిక సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెల్లడించిన వివరాలిలా వున్నాయి. మండలంలోని తంబుగానిపల్లి పంచాయతీ కొత్త వెంకటాపురం గ్రామంకు చెందిన ఉదయ్‌కిరణ్ భార్య నందిని(21) ఆత్మహత్యకు పాల్పడింది. మూడేళ్ళ క్రితం పెనుమూరు మండలం మఠంపల్లికి చెందిన నందినితో ఉదయ్‌కిరణ్‌కు వివాహం జరిగింది. మూడేళ్ళయిన పిల్లలు పుట్టలేదనే నెపంతో భర్త ఉదయ్‌కిరణ్, అత్త బుజ్జమ్మలు నందినిని ప్రతి రోజు వేధింపులకు గురి చేసేవారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో నందిని ఇంటి తలుపుకు గడియ పెట్టి లోపల వున్న బిరువా కొక్కికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయంను గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే ఇంటి తలుపులు పగులగొట్టి ఆత్మహత్యకు పాల్పడిన నందినిని చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. ఈ మేరకు మృతురాలు నందిని తల్లి లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు. మృతదేహంను శవపరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



**పాలసముద్రం, మే 23 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని టెలికాం వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ట్రాయ్ కాగ్ మెంబర్‌గా మరోసారి నియమితులైన పి.చిట్టిబాబు పేర్కొన్నారు. ట్రాయ్ కాగ్ మెంబర్‌గా చిట్టిబాబును నియమిస్తూ టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ నందకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంధ్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఆధునిక యుగంలో టెలికమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న తరుణంలో వినియోగదారులకు సదస్సులు, సమావేశాలు నిర్వహించి సమాచారంను బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. అలాగే కేబుల్ ప్రసారాల వ్యవస్థతో పాటు ప్రభుత్వ రంగ సంస్థ టెలికాం కంపెనీల నుండి సేవలు పొందుతున్న కోట్లాది మందికి ట్రాయ్ నుండి సూచనలు, సలహాలు, మెరుగైన సేవలు అందించడానికి అవకాశం కల్పించారన్నారు. తాను 2015 సంవత్సరం నుండి ట్రాయ్ కాగ్ మెంబర్‌గా వుంటున్నానని, తనను మరో రెండు సంవత్సరాలు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

## నేడు రెండు ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు

కుప్పం, మే 23 ప్రభాతవార్త : జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుప్పం,రామకుప్పం మండలంలో రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు రద్దైన హాకింగ్స్ పాఠశాల, శాంతినికేతన్ పాఠశాలల యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వడం జరుగుతుందని ఎంఇఒ మహబూబ్ బాషా తెలిపారు. శాంతినికేతన్ పాఠశాలలో వసతులు సక్రమంగా లేకపోవడంతో ప్రభుత్వం అనుమతులు రద్దు చేసిందన్నారు. ఈ రెండు స్కూళ్ల విద్యార్థులకు టిసిలు ఇవ్వకుంటే డిఇఒ, డివైఇఒ, ఎంఇఒలకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వరసిద్ధుని దర్శించుకున్న గుంటూరు జిల్లా ఎస్పీ

**కాణిపాకం, మే 23 ప్రభాతవార్త:**



గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి వారిని దర్శించుకున్నారు. వారి వెంట సూప ంరిటెండెంట్ శ్రీధర్‌బాబు, అర్చకులు టెంపుల్ ఇన్స్ పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొ న్నారు.

## కాణిపాకం ఆలయానికి 2.50 లక్షలు విరాళం



**కాణిపాకం, మే 23 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు భక్తులు శుక్రవారం 2.50 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు చెన్నైకు చెందిన అనిల్‌కుమార్, సునీత దంపతులు దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నపథకానికి 1.25 లక్షల రూపాయలను, శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 1.25 లక్షల రూపాయలను విరాళంగా అందించారు. ఈకార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, టెంపుల్ ఇన్స్ పెక్టర్ రవి దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దేవుని నల్లరాళ్ళగుట్టలో క్వారీ పనులు చేపట్టరాదు

-అడ్డుకున్న ఏడు గ్రామాల ప్రజలు



**ఐరాల, మే 23 ప్రభాతవార్త:** మండలంలోని నాగంవాండ్లపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని దేవుని నల్లరాళ్ళగుట్టలో క్వారీ పనులు చేపట్టరాదని నాగంవాండ్లపల్లె పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు శుక్రవారం అడ్డుకున్నారు. వివరాలిలా వున్నాయి, నాగంవాండ్లపల్లె పంచాయతీ పరిధిలోని దేవుని నల్లరాళ్లగుట్టపై కార్తీక మాసంలో పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు దీపాలు వెలిగించి పూజలు నిర్వహిస్తుంటారు. దీనితో ఆప్రాంత ప్రజలు ఈగుట్టను పవిత్రంగా భావిస్తుంటారు. ఈనేపథ్యంలో కొందరు వ్యక్తులు ఈగుట్టలో క్వారీ తవ్వకాల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందులో భాగంగా గుట్టవద్దకు ప్రోక్లయినర్‌తో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతుండగా నాగంవాండ్లపల్లె పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అక్కడకు చేరుకుని స్థానిక సర్పంచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. దీనతో చేసేది లేక రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేసి వెనుదిరిగారు. దీనిపై త్వరలో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆందోళనకారులు తెలిపారు.

## అర్ధగిరిలో వైభవంగా వసంతోత్సవం



**తవణంపల్లె, మే 23 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్య క్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీహనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం వసంతోత్స వంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ టి.హనుమంతరావు ఆధ్వర్యంలో దేవస్థానంలో ఈనెల 21నుండి శ్రీహనుమాన్ జయంతి వేడుకలు జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా చివరిరోజు వసంతోత్స వంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం అర్చకస్వాములు స్వామివారికి సుప్రభాతసేవ, కలశారాధన, వేదపారాయణంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే స్వామివారిని మంగళవాయిద్యాలు, నడుమ ప్రధాన ఆలయం, పవిత్ర సంజీవరాయని పుష్కరిణి చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో కడప కలెక్టర్ శ్రీధర్



**కాణిపాకం, మే 23 ప్రభాతవార్త:** కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ శుక్రవారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. .వారి వెంట ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తొడగొట్టిన అంజిరెడ్డికి మహానాడులో అవకాశం కల్పించండి



**పుంగనూరు, మే 23 ప్రభాతవార్త :** గత ప్రభుత్వ స్థానిక ఎన్నికలలో నామినేషన్ వేసేందుకు వెళ్లిన తనను అడ్డుకున్న నాయకులకు తొడగొట్టి సవాల్ విసిరిన తెలుగుదేశం కార్యకర్త అంజిరెడ్డి తాత తనకు మహానాడులో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాడు. పుంగనూరు నియోజకవర్గం పుంగనూరు మండలం మార్లపల్లికి చెందిన 85 ఏళ్ల అంజిరెడ్డి తాత గత స్థానిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరఫున నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. ఇదే సమయంలో అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ఆయనపై దాడి సిద్ధపడిన సందర్భంలో అంజిరెడ్డి తాత తొడగట్టి మీసం మేలేసి తన ప్రాణాలను లెక్కచేయక పోరాడారు. వైసీపీ నాయకులు అతనిపై హత్యా యత్నానికి ప్రయత్నించారు. వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు రౌడీయిజానికి భయపడకుండా ధైర్యంగా తొడగొట్టి నిలబడి రాష్ట్రంలో టిడిపి నాయకులకు కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారు. ఈ విజ్ఞప్తి ముఖ్య మంత్రి ఆలకించి ఆహ్వానం పంపితే తన జన్మ ధన్యమవుతుందని అంజిరెడ్డి తాత వ్యాఖ్యానించారు.

## కుప్పంలో పెద్ద ఎత్తున తిరంగా ర్యాలీ



**కుప్పం, మే 23 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం కుప్పం పట్టణంలో కూటమి నేతలు తిరంగా ర్యాలీని పెద్ద ఎత్తున నిర్వహించారు. స్థానిక పాతపేట చెరువు కట్ట నుంచి రైల్వే గేటు దాకా ఈ ర్యాలీ కొనసాగింది. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేసారు. ఈ ర్యాలీకి ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ హాజరై ప్రసంగించారు. ఆపరేషన్ సింధూర్‌భారతదేశ సైనిక, వైమానిక శక్తికి ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలో జరిగిన ఆపరేషన్ సింధూర్ కార్యక్రమం ప్రత్యర్థి దేశాలకు ఓ గుణపాఠం అన్నారు. కార్యక్రమాల్లో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర కార్యదర్శి బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కు మార్, బిజెపి జిల్లానేతతులసినాథ్,బిజెపికన్వీనర్ శివశ ంకర్, జనసేన కోఆర్డినేటర్ నరేష్, కూటమి నేతలు పాల్గొన్నారు.

## యోగాతో చక్కటి ఆరోగ్యం సాధ్యం : కంచర్ల



**కుప్పం, మే 23 ప్రభాతవార్త :** యోగాతో చక్కటి ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పంలో యోగాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు యోగా యాత్ర కారును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వైజాగ్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కౌన్సిలర్

## ఉన్నంవాసుదేవనాయుడుకు పరామర్శ

**తొట్టంబేడు, మే 23 ప్రభాతవార్త :**



ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి తొట్టంబేడు మండల అధ్యక్షుడు ఉన్నంవాసుదేవనాయుడు ఇటీవల అనారోగ్య కారణంగా చికిత్స చేసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూన్న వాసుదేవ నాయుడును మాజీ ఎంఎల్ఏ బియ్యపుమధుసూధనరెడ్డి, మాజీ దేవస్థానం ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు శుక్రవారం ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని మాజీ ఎంఎల్ఏ తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయన తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా రావాలన్నారు.తాము ఎప్పుడు అండగా ఉంటామని వాసునాయుడుకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కోవిచంద్రయ్య నాయుడు, మాజీ పిఎసిఎస్ ఛైర్మన్ మణినాయుడు, మాజీ బోర్డు సభ్యుడు భాస్కర్ ముదిరాజ్, మణి, పగడాల రాజు, ఉత్తరాజి శరవణకుమార్, కంఠా ఉదయ్, మున్నారాయల్, శ్రీవారిసురేష్, ఫఠాన్ ఫరీద్, ఫజల్, షేక్ గఫూర్, రవి, పెరుమాల్, అస్లాం, జివికెరెడ్డి, బావాజీ, సాదిక్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ భర్త వేలుకు నివాళులు

**తొట్టంబేడు, మే 23 ప్రభాతవార్త :**



పట్టణంలో 9వ వార్డు మాజీ కౌన్సి లర్ శెంజిగరం సుప్రజ భర్త శెంజిగరం వేలు ఆకస్మికంగా అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన స్వగ్రామమైన మండలంలోని కొమ్మనగుంట గ్రామంలో ఆయన భౌతిక కాయాన్ని తీసుకువచ్చారు. ఈసందర్భంగా ఆయన భౌతిక కాయానికి మాజీ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యానాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, యువనాయకుడు ప్రవీన్, మిన్నల్‌రవి, ఎస్‌డికె నగర్ యువనాయుడు గిరి, పలువురు మండల నాయకులు, పట్టణ నాయకులు హజరై శెంజిగరం వేలుకు నివాళులు అర్పించారు. నేడు ఆయన అంత్యక్రియలు తొట్టంబేడు మండలంలోని కొమ్మనగుంటలో నిర్వహించనున్నారు.

## కార్పొరేషన్ చైర్మెన్‌ను సత్కరించిన జనసైనికులు



**శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త:** కళలకు కళాకారులకు కాణాచి అయిన శ్రీకాళహస్తిలో హస్తకళల్లో ప్రధాన భాగమైన కలంకారి,కొయ్యబొమ్మల తయారి ప్రధానంగా ఉన్నాయని ఈ పరిశ్రమల మీద ఆధార పడి కొన్ని వందల కుటుంబాలు జీవిస్తున్నాయని శ్రీకాళహస్తి జనసేన నాయకులు నూతనంగా ఎంపికైన రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మెన్ పసుపులేటి హరిప్రసాద్‌కు వివరించారు. శుక్రవారం జిల్లా కార్యదర్శి కొట్టే సాయి సారధ్యంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తిరుపతి రహదారిలో చెర్లోపల్లి గ్రామ సమీపంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసారని కానీ అక్కడ తగిన వసతులు,గుర్తింపులేనందువల్ల కొనసాగటం లేదన్నారు. కొత్త క్లస్టర్‌ను ఏర్పేడు మండలంలోని మాధవమాల వద్ద మంజూరు చేసారని కానీ అమలు జరగలేదన్నారు. అలాగే శ్రీకాళహస్తి మండలంలోని మాధమాలలో కొయ్యబొమ్మల తయారి,శ్రీకాళహస్తిలో కలంకారి పానగల్, శుకబ్రహ్మాశ్రమం, కొత్తపేట, ప్రాజెక్టు వీధుల్లో అత్యధికంగా ఉందన్నారు. వందలాదిమంది కళాకారులు జీవనోపాధిగా మలచుకున్నారని వివరించారు. మీరు హస్తకళల బోర్డు ఛైర్మెన్ కావటం ఈ ప్రాంతానికి ఓ వరంగా ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమాల్లో కుమార్,ఈర్ల చిరంజీవి, రాఘవ, దండిరాఘవయ్య, కిరణ్‌రామ్‌శెట్టి, గరికపాటి చంద్ర, పగడాల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన బాలుడి మృతికి కారణమైన...

## ముగ్గురు నిందితులు అరెస్టు!

సత్యవేడు, మే 23 ప్రభాతవార్త:

సత్యవేడు పోలీసులకు గిరిజన బాలుడి నిర్బంధంపై ఫిర్యాదు అందింది. ఫిర్యాదును నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టి ముద్దాయిలను అరెస్టు చేశారు. ఈ కేసు అంశమై స్థానిక పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రవికుమార్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు... గూడూరు మండలం చవటపాలెంకు చెందిన యానాది అంకమ్మ, చెంచయ్య దంపతులకు చెంచు కృష్ణయ్య, రామలక్ష్మమ్మ, వెంకటేష్ అనే ముగ్గురు సంతానం. అంకమ్మ ఆమె కుటుంబ సభ్యులు, అదే కులానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తితో సహజీవనం చేసుకుంటూ దుత్తలూరు మండలం తుర్కపల్లిలోని శివరామకృష్ణ పొలంలో నెలకు 15 వేల వేతనానికి పని చేసుకుంటూ ఉండేవారు. అంకమ్మ తల్లిదండ్రులు పశు కాపరులుగా ఉండడం, ముద్దాయితో పరిచయం ఏర్పడి, పనికి పిలవడం, ఆ మేరకు వారు అక్కడ నుంచి ఇక్కడకు 15 వేలు అడ్వాన్స్ తీసుకుని 10 వేల జీతానికి సత్యవేడు మండలం ఎన్ఆర్ అగ్రహారానికి చెందిన ముత్తు, ధనభాగ్యం వద్దకు పనికి ఒప్పుకుని రావడం జరిగింది. అయితే అంకమ్మ ప్రకాష్, ఆమె పిల్లలు ఒక సంవత్సరం పాటుగా ముత్తు వద్ద పని చేశారు. వ్యవసాయ పనులు, బాతులు మేపడం వంటివి చేసేవారు. పని ఎక్కువగా చేపిస్తున్నారు. జీతం పెంచండి అని అడిగినఆ ముత్తు వినిపించుకునే వాడు కాదు. ఇదే సమయంలో అంకమ్మ భర్త చెంచయ్య మరణించడంతో ఆమె వారి సొంత ఊరికి వెళుతుంది, కర్మక్రియలు కార్యక్రమాలు ముగిస్తుంది. అయితే నెలటూరు గ్రామానికి చెందిన సతీష్ అనే వ్యక్తి తన వద్ద అప్పు తీసుకున్న నగదు తిరిగి చెల్లించాలని నిలదీయగా, అప్పుడు ముత్తు అక్కడ పోయి 25 వేలు చెల్లించి అంకమ్మను తీసుకుని వచ్చి పనిలో



పెట్టుకుంటాడు, కానీ కొంత కాలానికి అంకమ్మ సొంత ఊరికి వెళ్లిపోవాలని నిర్ణయించుకోగా 42 వేలు చెల్లించాల్సిందిగా ముత్తు చెప్పడం జరుగుతుందని, కొంచెం టైమ్ కావాలని అంకమ్మ అడగగా, అప్పటి వరకు ఆమె చిన్న కుమారుడు వెంకటేష్(9) వదిలి వెళ్లాల్సిందిగా చెబుతాడు. వారు అలానే వదిలి వెళ్తారు. అయితే ముత్తు గిరిజన బాలుడైన వెంకటేష్ చేత కష్టతరమైన పనులు చేయించేవాడు. వెంకటేష్ రోజు తన తల్లి వద్ద ఏడ్చుకునే వాడు. అలా అలా అంకమ్మ నగదు రెడీ చేసుకునే లోపు 9 నెలలు గడిచిపోయింది. డప్పు రెడీ అయింది తన కుమారుడిని పంపండి అంటూ అంకమ్మ కోరగా అందుకు ముత్తు కంచి దగ్గర ఉన్నాము మరో 20 రోజుల్లో బాతులు అమ్మేస్తామని చెప్పాడు. కొన్ని రోజులకి ఏటో వెళ్లిపోయాడు మాకు తెలియదని తెలపడంతో అనంతరం ముత్తు కంచి నుంచి కరడి పుత్తూరు వద్ద యధావిధిగా బాతులు మేపుతున్నాడు. ఒ రోజు అంకమ్మ, ముత్తు ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేయగా ముత్తు భార్య ధనభాగ్యం, రాజశేఖర్ ఆమెపై తిరగబడి కులం పేరుతో దూషించారు. దీంతో ఏమి చేయాలో తెలియక ఈ నెల 19న అంకమ్మ తన కుమారుడి పరిస్థితిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు ముత్తు, ధనభాగ్యం, రాజశేఖర్‌లపై అక్రమ నిర్బంధం, బాండెడ్ లెటర్ చట్టం, చైల్డ్ లేబర్ చట్టం, జువైనెల్ జస్టిస్, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు ముద్దాయిలను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా పలు నిజాలు బయటకు వచ్చాయి. డీఎస్పీ పర్యవేక్షణలో రెండు పోలీసు బృందాలు కంచి వద్దకు చేరుకుని దర్యాప్తు చేశారు. ముత్తు, వెంకటేష్ అనే గిరిజన బాలుడితో కలసి బాతులు మేపుకుంటూ చెంగల్లట్టు జిల్లా కంచి సమీపంలోని తిరునల్లూరు వద్దకు చేరుకున్నారు. వెంకటేష్‌కు తీవ్ర అనారోగ్యం కావడంతో పుదుపాళెం జంక్షణలోని లింగా ఆస్పత్రిలో ఏప్రిల్ 11న చూపించారు. అయినా ఆరోగ్యం సరికాకపోగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఏప్రిల్ 12న అదే ఆస్పత్రిలో ముత్తు చేర్పించాడు. ఆ రోజే ఆ బాలుడు మరణించడం జరిగింది. అందుకు సంబంధించి సీసీ టీవీల ఫేటేజ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆపై అంకమ్మకు తెలిస్తే పెద్ద కేసు అవుతుందని భావించిన ముత్తు, భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్‌కు కబురు అందించి, వారి సాయంతో ఆ బాలుడిని పాలేరు నదిలో పూడ్చి వేయడం జరిగింది. కంచి సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో కంచి తాలుకా మెజిస్ట్రేట్ రఫిక్ స్వీయ పర్యవేక్షణల్లో బాలుడి మృతదేహాన్ని వెలికి తీసి, శవ పంచనామా నిర్వహించి కంచి మెడికల్ కాలేజీకి తరలించడం జరిగిందన్నారు. గిరిజన బాలుడి మృతికి కారణమైన ముత్తు, ధనభాగ్యం, రాజశేఖర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని డీఎస్పీ తెలిపారు.

## శివయ్య సేవలో కలెక్టర్

శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం కడపజిల్లా కలెక్టర్ చెరకూరి శ్రీధర్ కుటుంబసభ్యులతో దర్శనం చేసుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. స్వామిఅమ్మవార్ల దర్శనానంతరం వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలను ఎఇఓ సతీష్‌మాలిక్ అందించారు.

## జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ ప్రభంజనం

తిరుపతి విద్య, మే 23 ప్రభాతవార్త:



జే.ఈ.ఈ మెయిన్ (బి ఆర్చ్) 2025 ఫలితాలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించాలని డి.జి.యం కొండలరావు తెలిపారు. ఓపెన్ క్యాటగిరిలో ఎం.భానుచరణ్ రెడ్డి 54 (ఈడబ్ల్యుఎస్ 3),శశాంక్ రెడ్డి 58 (ఈడబ్ల్యుఎస్4), హిమేష్ రాఘవ చంద్ర 59(ఓ బి సి11), విశాల్ చౌదరి 578,పునీత్ శేఖర్ రెడ్డి 873 వంటి అత్యుత్తమ ర్యాంకులతో పాటు మొదటి 1000 లో 5, ఐదు వేలలో 8,పది వేలలో 11 ర్యాంకులు ఒక్క ఓపెన్ కేటగిరీలోనే సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ సురేష్ నాయుడు,ఐఐటి ఫ్యాకల్టీ విజయకుమార్, అభిషేక్,చిట్టిబాబు, దుర్గాప్రసాద్,ఎ.జి.యం గోపీచంద్ అభినందించారు.

## 21 ఏళ్ళ లోపు యువకులకు మద్యం విక్రయించవద్దు!

చంద్రగిరి, మే 23 ప్రభాతవార్త:




21 ఏళ్ళ లోపు యువకులకు మద్యం విక్రయించవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కెవిఎస్ ఫణీంధ్ర అన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చిత్తూరు అసిస్టెంట్ కమీషనర్ వారి ఆదేశాల మేరకు.. శుక్రవారం సిఐ ఫణీంద్ర, ఎస్ఐలు సుధాకర్ రావు, గిరి ఉమ్మడిగా తమ సిబ్బందితో కలసి మద్యం దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చంద్రగిరి పరిధిలోని 17 మద్యం షాపులు, 1 బార్ నందు తెరచివుంచే సమయాన్ని తెలియజేస్తూ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా మద్యం షాపుల వద్ద మద్యం సేవించే కార్యక్రమాలను నిలువరించాలనీ, మద్యం విడిగా విక్రయించడం చేయవద్దని తెల్పిచెప్పారు. మద్యం విక్రయాలపై రికార్డుల నిర్వహణ, నిబంధనల పాటించడంలో విఫలమైతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## స్విమ్స్ ఉద్యోగులకు అన్యాయం జరగనివ్వం

– బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి శీనప్ప

తిరుపతి హెల్త్, మే 23 ప్రభాతవార్త : బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి శీనప్ప ఆధ్వర్యంలో స్విమ్స్‌లో సుమారు 570 పోస్టులకు రాబోవు నోటికేషన్ ద్వారా గత పాతిక సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నటువంటి వారికి అన్యాయం జరుగుతుందని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని అలాగే 10 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం పనిచేస్తున్న ఉద్యోగస్తులకు ఉచిత చికిత్స, ఆరోగ్య సేవలను అందించాలని స్విమ్స్ డైరెక్టర్‌కు మెమోరాండం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ స్విమ్స్ ప్రెసిడెంట్ హేమారాణి, స్వర్ణలత, ఓంనాథంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పూడి గ్రామాన్ని అభివృద్ధి చేయండి

తొట్టంబేడు, మే 23 ప్రభాతవార్త :



ఎంఎల్ఏ గారు పూడి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని జడ్పీటిసి అర్చనాదేవి భర్త మాజీ సర్పంచ్ మునిరత్నం ఎంఎల్ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డిని కోరారు. పార్టీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ మునిరత్నం, గ్రామస్తులు ఎంఎల్ఏను మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువ పూలమాలతో సత్కరించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ మునిరత్నం మాట్లాడుతూ పూడి గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని ముఖ్యంగా డ్రైనేజీ కాలువలతో పాటు హరిజన, గిరిజనవాడల్లో రోడ్డు వేసి అభివృద్ధి చేయాలని ఎంఎల్ఏను కోరారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఏ ఏసమస్య ఉన్నా వెంటనే తనకు చెప్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానని తెలిపారు.

## ప్రవక్తల జీవితాలను అధ్యయనం చేయండి

శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త:



'మార్పు అనేది మొదట మన నుంచే ప్రారంభం కావాలని తరువాత మన కుటుంబంలో మార్పు తీసుకురావాలని' హాఫీజే ఖుర్ అన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియామస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన జుల్ హుదా మాసం ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రవక్తల ఇబ్రహీం ఖలీలుల్లా జీవితాన్ని వివరిస్తూ ఆయనకు ముందు వారి పెద్దలు విగ్రహారాధన చేసే వారని అయితే ఆయన మొదట మారమని కోరింది వారి తండ్రిగారినే అని వివరించారు. తరువాత సమాజం మార్పును కోరుకోవాలన్నారు. దైవ మార్గాన్ని విశ్వసించిన ప్రవక్తలు ఆయన ఆదేశాలతో కన్న బిడ్డను సైతం బలి ఇవ్వటానికి వెనుకాడలేదన్నారు. అలాంటి చిత్తశుద్ధి కల్గిన దైవారాధనను అలవాటు చేసుకోవాలన్నారు. బక్రీద్ పండగ ప్రాధాన్యతను వివరించారు.

## ఎంపి ఎన్నికల కమిషనర్

శ్రీకాళహస్తిరూరల్,మే 23 ప్రభాతవార్త :



ఏర్పేడు మండలంలోని గుడిమల్లం ఆలయంలో వెలసిన పరశురామేశ్వరుని ఆలయంలో శుక్రవారం మధ్యప్రదేశ్ ఎన్నికల కమిషనర్ మనోజ్‌కుమార్ శ్రీ వాత్సవ్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. తరువాత దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గుడిమల్లంకు వచ్చిన ఎన్నికల కమిషనర్‌కు మాజీ ఛైర్మెన్ బత్తల గిరినాయుడు, ఆలయ ఇఒ రామచంద్రారెడ్డిలుస్వాగతం పలికారు. స్వామి వారి దర్శనానంతరం ఆయనకు ఆలయ మర్యాదలతో ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను ఇఒ రామచంద్రారెడ్డి అందించారు.

## పోలేరమ్మ జాతరలో సిపాయి

శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త :



ఏర్పేడు మండలం నాగంపల్లి గ్రామంలో పోలేరమ్మ ఆలయాన్ని ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నిర్మాణానికి ప్రధాన భూమిక పోషించారు. మహిమాన్వితమైన పోలేరమ్మ ఆలయంలో జాతర సందర్భంగా శుక్రవారం డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి మండలంలోని గ్రామాల్లో జాతరల సంబరాలు చోటు చేసుకున్నాయి. ఏర్పేడు మండలంలోని పలు గ్రామాల్లో డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ప్రత్యేక ఆర్థిక సహాయ సహాకారాలను అందించారు. ఈ నేపథ్యంలో నాగంపల్లిలో పోలేరమ్మ ఆలయ నిర్మాణం ప్రధాన భాగస్వామి అయ్యారు. ఈ నేపథ్యంలో జాతర సందర్భంగా గ్రామస్థుల ఆహ్వానం మేరకు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరు కాగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనతో కలసి యువకులు జాతర సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పాగాలి సర్పంచ్ గాదే రాజేశ్వరి, నరసింహులు రెడ్డి గంగాధర్‌రెడ్డి భరత్, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## ఏర్పేడు పాఠశాలను పరిశీలించిన ఎ.పి కోఆర్డినేటర్

శ్రీకాళహస్తిరూరల్,మే 23 ప్రభాతవార్త :




ఏర్పేడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ గౌరీ శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందు సకల సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం విధి విధానాలు రూపొందించింది. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి కోసం మంజూరు చేసిన ఆర్టిజంసెంటర్, సైన్స్ ల్యాబ్స్ కోసం అవసరమైనటువంటి తరగతి గదులను పరిశీలించారు. మండలంలో పిఎంశ్రీలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లంలో పాఠశాలను పరిశీలించారు. ఇక్కడ త్వరితగతిన ల్యాబ్‌లు, కిచెన్, గార్డెన్,అదనపు గదుల నిర్మాణాలను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు జిల్లా అధికారులైన ఆకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, జిల్లా ఐఇ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మండల విద్యాశాఖ అధికారులు డి.ప్రేమలత, ఏ దయాకర్, ప్రధానోపాధ్యాయులు కె.సునీత, ఆనంద్, ఉపాధ్యాయులు మోహన్‌బాబు, లావణ్య,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ పకడ్బందీ ఏర్పాట్లు

- పరీక్షలపై సమీక్షించిన పరీక్షల ప్రత్యేక అధికారి , సంయుక్త కార్యదర్శి ఎస్.జి అజ్మీరా
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, మే 23 ప్రభాతవార్త :

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, యూపీఎస్సీ అబ్జర్వర్ హన్సవదనలతో కలిసి యూపీఎస్సీ ప్రత్యేక అధికారి, సంయుక్త కార్యదర్శి ఎస్.జి అజ్మీరా సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 ఈ నెల 25వ తేదిన నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షలకు తిరుపతి జిల్లాలో ఈ పరీక్షలను 12 ప్రభుత్వ కళాశాలలు, ఒక ప్రైవేట్ కళాశాలలో మొత్తం 13 సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 5261 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11.30




గంటలకు వరకు, అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, తిరుపతి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ చరణ్ తేజ్, డీఎంఅండ్ హెచ్‌వో బాలకృష్ణ నాయక్, డ్వామా పీడీ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీఎస్పీడీసీఎల్ సురేంద్రనాయుడు, జిల్లా కో–ఆపరేటివ్ అధికారిని లక్ష్మి, ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్, పోస్టల్ అధికారులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## టిడిపి నాయకుడికి పులివర్తి వినీల్ పరామర్శ

చంద్రగిరి, మే 23 ప్రభాతవార్త:



అనారోగ్యంతో భాధపడుతున్న టిడిపి నాయకుడు, మాజీ ఎంపిటిసి హేమాద్రి నాయుడును శుక్రవారం టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ పరామర్శించారు. మండల పరిధిలోని భీమవరం పంచాయతీ, చిన్న రామాపురంకు చెందిన హేమాద్రి నాయుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో భాధపడుతూ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న ఆయన డిసిఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, తుడా మాజీ డైరెక్టర్ ఏజి పల్లి బాల, టిడిపి నాయకులతో కలసి వెళ్ళి పరామర్శించారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగితెలుసుకున్నారు. అనంతరం హేమాద్రికి ధైర్యం చెప్పిన ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఊయ్యాలసేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం, మే 23 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధిక మైంది. అంతకు ముందు అమ్మవారిని, స్వామి వారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, నిత్యా కైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం సుగంధద్ర వ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## నరసింహయాదవ్‌ని సత్కరించిన జడ్పీటీసీ

నారాయణవనం, మే 23 ప్రభాతవార్త :



తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు, రాష్ట్ర యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్‌ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, నారాయణవనం జడ్పీటీసీ, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ శుక్రవారం తిరుపతిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ని దుశ్వాలువతో సత్కరించారు. రాష్ట్ర యాదవ కార్పోరేషన్ ఛైర్మన్‌గా నియమితులుకావడం పట్ల అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీతో పాటు యాదవ కులాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్లడానికి కృషి చేయాలని కోరారు.

## కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో వుంటా

రేణిగుంట మే 23 ప్రభాతవార్త :



పట్టణ అధ్యక్ష పదవి బాధ్యతలు పెంచిందని రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షులు మహబూబ్ బాషా అన్నారు. రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్ష పదవి మరోసారి మహబూబ్ బాషాను వరించిన విషయం విధితమే. ఈ సందర్భంగా ప్రభాతవార్త ప్రతినిధితో భాష మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేశారు అన్నారు. సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి రిషిత, ఆయన మాతృమూర్తి బృందమ్మకు ధన్యవాదాలు తెలిపారు. పదవి తనకు అలంకారప్రాయం కాదని ఎంతో బాధ్యత తనపై పడిందన్నారు. కార్యకర్తలకు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సూచనలతో అధికారుల ద్వారా తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి అందర్నీ కలుపుకొని ముందుకు పోతానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు చేస్తున్న సేవలు ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. వీలైనంతవరకు విమర్శలకు తావివ్వకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు

## తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ఏకగ్రీవం

విజయపురం, మే 23 ప్రభాతవార్త:



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు పార్టీ చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు ఆధ్వర్యంలో మండలకమిటీ ఏకగ్రీవంగా నియామకం జరిగింది. ఇందులో అధ్యక్షుడిగా గాదిరాజు రమేష్ రాజు, ప్రధాన కార్యదర్శిగా బాబు యాదవ్, బీసీసెల్ అధ్యక్షు డిగా ఉదయకుమార్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు గుణ భూషణమ్మ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మహేంద్ర, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మహేంద్ర, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా చెంచయ్య, మైనారిటీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు మోహన్, ఐ టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ మా మీద నమ్మకం ఉంచి పార్టీ పదవులు అందించిన ఎమ్మెల్యే భానుప్రకాష్, పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని పలువురుటీడీపీనాయకులు,కార్యకర్తలు,అభిమానులు నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## ఇంటి స్థలాలు చూపాలని ధర్నా

విజయపురం, మే 23 ప్రభాతవార్త:



మాకు ఇచ్చిన ఇంటి పట్టాలకు స్థలాలు చూపాలని సీపీఐ నాయకులు శుక్రవా రం మండలంలోనిఇ కేవీపురం సచివా లయం ఎదుట ధర్నా నిర్వహించారు. రెండు సంవత్సరాలక్రితం సర్వే నెం.183లో 78 మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసిందని, అధికారులకు పదే పదే చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదో ఒక సాకు చెప్పుకుంటూ రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. నగరి ఎమ్మెల్యే స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, నాయకులు ఏసుపాదం, గోవిందస్వామి, పూర్ణిమ, అముద, మల్లీశ్వరి, జయంతి, యువరాణి, మహేంద్ర, సుబ్రహ్మణ్యం, రవి, శరవణ, రాజేష్ పాల్గొన్నారు.

## టిటిడి అభివృద్ధికి సహకరించాలి

–స్వామివారి ఆశీస్సులందుకోవాలి

తిరుమల,మే 23 ప్రభాతవార్తప్రతినిధి:



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయా లకనుగుణంగా టిటిడి, తుడ అభివృద్ధికి సహకరించాలని, తుడకు మంచిపేరు తీసుకురావాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు హితవు చేశారు. తుడ ఛైర్మన్‌గా, టిటిడి బోర్డు ఎక్స్ అఫిషియోసభ్యుడుగా ప్రమాణస్వీకారం చేసిన దివాకర్‌రెడ్డి ఛైర్మన్ బిఆర్‌నాయుడును, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## టిటిడి ఛైర్మన్ నాయుడుతో దర్శకుడు రాఘవేంద్రరావు

తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:



టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును సినీ దర్శకుడు రాఘవేంద్రరావు శుక్రవారం కలిశారు. తన పుట్టినరోజున శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఛైర్మన్‌ను ఆత్మీయంగా అభినందించారు.

## ప్రొటోకాల్ ఉల్లంఘనపై రైల్వేమంత్రికి ఫిర్యాదు



సూళ్లూరుపేట, మే 23 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో అమృత్‌భారత్ స్టేషన్ల ఆధునికీకరణలో భాగంగా ప్రొటోకాల్ ఉల్లంఘించారని, దీనిపై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అమృత భారత్ స్టేషన్ల ఆధునికీకరణలో భాగంగా గురువారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి పట్టణ ప్రథమ పౌరుడినైన తనకు అవమానం జరిగిందని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్‌గా ఆహ్వానించి కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించలేదని శ్రీమంత్‌రెడ్డి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టం 1965 ప్రకారం మున్సిపల్ సంస్థలు చట్టబద్ధమైన పరిపాలన యంత్రాంగం స్థానిక ప్రభుత్వ సంస్థలకు, ప్రజాప్రతినిధులకు అధికారిక కార్యక్రమాల్లో తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని చట్టం ఉందని తెలిపారు. ఈ సంఘటనపై దక్షిణమధ్య రైల్వే, సదరన్ రైల్వే అధికారులు వివరణ ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాల్లో స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ పాటించే విధంగా మార్గదర్శకాలు జారీ చేయాలని రైల్వేమంత్రికి వినతి చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఆయనకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు శ్రీమంత్‌రెడ్డి తెలిపారు.

## ఎయిడ్స్ నివారణపై అవగాహన



సూళ్లూరుపేట, మే 23 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌ఐవి ఎయిడ్స్‌పై స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మన సంస్కృతి కళాసంస్థ బృందంతో వీధి నాటకం ద్వారా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన సంస్కృతి కళా సంస్థ రెడ్డప్ప బృందం వీధి నాటకం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచే విధంగా ప్రదర్శనలు చేశారు. నవజీవన్ సిసిపియు ప్రాజెక్టు మేనేజర్ కె.బాలాజీ, మంజుల, నందిని, ఎఎన్‌ఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## జూన్ నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



కోట, మే 23 ప్రభాతవార్త: ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం గృహ నిర్మాణ శాఖ, సచివాలయాల అసిస్టెంట్ ఇంజినీర్లతో ఎంపిడిఓ దిలీప్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడిఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చాలన్నారు. మండలంలో 687 పక్కాగృహాలు మంజూరయ్యాయని, అందులో 115 గృహాలు పూర్తయినట్లు పేర్కొన్నారు. 99 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఎస్సీలకు గృహనిర్మాణాల కోసం అదనంగా రూ.50 వేలు ఇస్తారని తెలిపారు. ఎస్టీలకు రూ.75 వేలు ఇస్తారని తెలిపారు. లబ్ధిదారులతో మాట్లాడి గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఏఇ భాస్కర్‌రావు, ఎపిఎం అనిల, మండలంలోని సచివాలయాల అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

## వనం వదిలి...పొలాల్లోకి వన్య ప్రాణులు

కోట, మే 23 ప్రభాతవార్త: అడవుల్లో వన్య ప్రాణుల స్వేచ్ఛాయుత వాతావరణానికి భంగం వాటిల్లింది. ఏటా వేసవిలో నిప్పు రాజుకుని పచ్చదనం హరించిపోతోంది. అడవి జంతువులకు మేత, నీళ్ల దొరకడం లేదు. దీనికితోడు వన్య ప్రాణుల కోసం అటవీశాఖ చేపట్టే సంరక్షణ చర్యలు నామమాత్రంగా మారాయి. ఫలితంగా జింకలు, దుప్పులు జనావాసాల్లోకి వచ్చి ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి. ఇటీవల కాలంలో కోట మండలం చిట్టేడు పంచాయతీలో మైక్రోటవర్ కాలనీ సమీపంలో పొలంలోకి వచ్చిన ఓ జింకపై కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే అది చనిపోయింది. వెంకన్నపాలెం పంచాయతీలోని వీరారెడ్డి సత్రం సమీపంలో మరో దుప్పి రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. వన్య ప్రాణులకు నీళ్ల కరువవడంతో అవి జనావాసాల్లోకి రావడంతో కుక్కల బారిన పడుతున్నాయి. అటవీ శాఖ అధికారులు వన్య ప్రాణులకు నీటి వసతి కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజలు గుర్తు చేస్తున్నారు.

## అక్రమమైనింగ్‌పై కేంద్ర మైనింగ్ సెక్రటరీకి ఫిర్యాదు



వెంకటగిరి, మే 23 ప్రభాతవార్త : ఢిల్లీలోని కేంద్ర మైనింగ్ సెక్రటరీ కాంతారావుని తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలిసి వెంకటగిరి నియోజకవర్గం లోని సైదాపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేసిన వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఈ ఫిర్యాదు చేశారు. స్పందించిన మైనింగ్ సెక్రటరీ కాంతారావు తక్షణమే వివరాలు తెప్పించుకొని తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఫిర్యాదును మైనింగ్ మంత్రి కిషన్ రెడ్డికి, సహాయ మంత్రి సతీష్ చంద్ర దుబేకి ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడం జరిగిందని నేదురుమల్లి తెలిపారు.

## వన సంరక్షణ సమితుల సభ్యుల ధర్నా



వెంకటగిరి, మే 23 ప్రభాతవార్త: వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఫారెస్ట్ ఆఫీస్ వద్ద వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు చెందిన వన సంరక్షణ సమితి సభ్యులు చైర్మన్లతో కలిసి మహా ధర్నా నిర్వహించారు. వన సంరక్షణ సమితి జిల్లా కార్యదర్శి పల్లెపాటి బాలకృష్ణయ్య మాట్లాడుతూ 2023 24 సంవత్సరానికి గాను 32 సొసైటీలు ఈ జామాయిల్ చెట్లని నరికి వాటిని భద్రంగా చేర్చడం జరిగినదనిదానికి సంబంధించిన చెక్కులు ఇవ్వలేదన్నారు. నాలుగు కోట్ల 50 లక్షల రూపాయలు వచ్చినప్పటికీ ఆ డీడీలు వెంకటగిరి వనరక్షణ సమితి ద్వారా రేంజర్ వద్ద చెక్కులు ఉన్నట్లు తెలిపారు. 2 రోజులలో విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ధర్నాలో 32 వన సంరక్షణ సమితుల చైర్మన్లు నెంబర్లు, ఎస్‌వి నరసింహులు, వీధి విక్రయదారుల పాల్గొన్నారు.

## కొత్తపట్నంలో మళ్లీ పాత పనులే చేస్తున్నారు

కోట,మే 23 ప్రభాతవార్త: మండలం కొత్తపట్నం గ్రామ పంచాయతీలోని మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పనులు చేసిన పనులేని మళ్లీ చేస్తున్నారని ఆగ్రామ సర్పంచ్, ఈదురు తిరుపాలయ్య, కూలీలు శుక్రవారం ఎంపిడిఒ దిలీప్ కుమార్ కు పిర్యాదు చేశారు. ఆమేరకు విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో కూడా అనేక అవకతవకలు,అవినీతి జరిగిందని ప్రజా వేధిక సాక్షి గా పిడి శ్రీనివాస్ ప్రసాద్ చెప్పారు. మళ్లీ ఇలాంటి పనులు ఏంది అంటూ ఆగ్రామ ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆగ్రామస్థులు కోరతున్నారు.

## సర్వేలో పాల్గొన్న ఎంపిడిఓ శ్రీనివాసులు



వాకాడు, మే 23 ప్రభాతవార్త : మండల కేంద్రంలో ఉన్న సచివాలయాలు వాకాడు 2, నెల్లిపూడి పరిధిలో ఉన్న జరుగుతున్నటువంటి యోగ సర్వేలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు శుక్రవారం పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం వారు సంయుక్తంగా నిర్వహిస్తున్నటువంటి యోగలో ప్రతి ఒక్కరు విధిగా పాల్గొనాల్సిందిగా వారి యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిందిగా ఎంపీడీవో తెలిపారు. నిండు నూరేళ్ల ఆరోగ్యంగా ఉండేందుకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆయన తెలిపారు, నెల్లిపూడి సచివాలయ పరిధిలో ఉన్న ఎస్టీ కాలనీ నందు సర్వే నందు పాల్గొని యోగా గురించి వారికి అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్నవారు మండల కేంద్రంలో జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్వచ్ఛందంగా పాల్గొనాలని తెలిపారు. ఈ సర్వేలో పంచాయతీ కార్యదర్శి ప్రవళిక, డిజిటల్ అసిస్టెంట్ జితేంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పేద విద్యార్థికి ఆర్థిక సాయం



చిట్టమూరు,మే 23 ప్రభాతవార్త : టిఎంఆర్ కళాశాలలో చదివిన భువన్ అనే పేద విద్యార్థికి టిఎంఆర్ కళాశాల ప్రిన్సిపల్ రహంతుల్లా, నాయుడుపేట కు చెందిన పాపాడి సందీప్‌రెడ్డి గారి దాతృత్వంతో విద్యార్థికి విద్యా అవసరాల నిమిత్తం ఐదువేల రూపాయలను అందించడం జరిగింది. శుక్రవారం కొత్తగుంటలోని టిఎంఆర్ కళాశాల, పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఈ నగదును విద్యార్థికి అందజేశారు.

## కాలినడకన తుడా చైర్మన్ తిరుమలకు పయనం

**-శ్రీవారిమెట్టు మార్గంలో మొక్కులు తీర్చుకున్న డాలర్స్**



చంద్రగిరి, మే 23 ప్రభాతవార్త: తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి దంపతులు శుక్రవారం తిరుమల శ్రీవారి దర్శనార్థం శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు కాలినడకన పయనమయ్యారు. తిరుపతి రూరల్ మండలం, పెరుమాళ్ పల్లికి చెందిన డాలర్స్ దివాకర్‌రెడ్డి రియల్టర్‌గా స్థిరపడ్డారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో టిడిపిలో చేరిన ఆయన ఎంఎల్ఏ పులివర్తి నాని విజయంలో కీలకంగా పనిచేశారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఏ పులివర్తి నాని సంపూర్ణ మద్దతుతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయనను తుడా చైర్మన్‌గా, టిటిడి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా అవకాశం కల్పించారు. తుడా చైర్మన్‌గా ప్రమాణం చేసిన ఆయన శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన తిరుమలకు బయలుదేరివెళ్ళి శ్రీవారి ఆలయంలో టిటిడి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం శ్రీవారికి మొక్కులు తీర్చుకున్నారు.

**కాలినడకన కొండకు వచ్చి....**

## సేవకుడిగా సేవలందించే భాగ్యం అదృష్టం

**-టిటిడి ఎక్స్అఫిషియోసభ్యుడు దివాకర్‌రెడ్డి**



తిరుమల,మే 23 ప్రభాతవార్త ప్రతినిధి: గోవింద నామంతో తిరుమలకు వస్తున్న భక్తులకు సౌకర్యాల కల్పనలో తనవంతు కృషి చేస్తానని, పాలకమండలితో కలసి సేవలందిస్తానని తుడచైర్మన్, టిటిడి బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడు సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. టిటిడి ఎక్స్ అఫిషియో సభ్యుడుగా ఆయన శుక్రవారం ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. ఆయనచేత టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులతో కలసి తిరుమలేశుని దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి వేదాశీర్వచనం,శ్రీవారి తీర్థప్రసాదాలు ,చిత్రపటం అందజేశారు. అంతకుముందు ఆయన గురువారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు.

## భక్తుల సౌకర్యాలే పరమావధిగా...!

**వేకువజామున అదనపు ఈఓ చౌదరి తనిఖీలు**



తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి: అసలే వేసవిసెలవులు...ఆపై గత వారం రోజులుగా తిరుమలలో భక్తుల తాకిడి పెరగడంతో త్వరితగతిన భక్తులకు దర్శనం చేయించేలా టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి చొరవ తీసుకుంటున్నారు. వెంకన్న దర్శనానికి వచ్చిన భక్తులు వెలుపల క్యూలైన్లలో ఉన్న వారికి సౌకర్యాలు, క్యూలైన్లలో భక్తుల సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం వేకువ జామున సామాన్యభక్తుడిలా తనవెంట సిబ్బందికూడా లేకుండా వైకుంఠమ్ క్యూలైన్లలో కృష్ణతేజ విశ్రాంతి భవనంవద్ద లైన్లలో వెళ్లి పంపిణీ చేస్తున్న అన్నప్రసాదాలు, పాలు, తాగునీరు పరిశీలించారు. భక్తులను పలకరించి దర్శనం సమయం, సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే ఆయన ఆలయ అధికారులను సమన్వయం చేసుకుని గురువారంరోజు రికార్డు స్థాయిలో 72,579 మంది భక్తులు వెంకన్నను దర్శించుకునేలా చూశారు.

## కంపుతో... కేవీబీపురానికి స్వాగతం

**-దుర్గంధం వెదజల్లుతున్న మండల కేంద్రం -ఏళ్ళ తరబడి ఇదే పరిస్థితి, పట్టించుకునే వారు లేర్చు -కోళ్లు, చేపల వ్యర్థాలతో భ్రష్టు పట్టిన కేవీబీపురం**



కేవీబీ పురం, మే 23 ప్రభాతవార్త: కొన్నేళ్ళ క్రితం వరకు అత్యంత సుందరంగా పచ్చని పైరు పంటల అందాలతో ఒక వెలుగు వెలిగిన శ్రీకాళహస్తి-కేవీబీపురం ప్రధాన ప్రవేశం ప్రస్తుతం స్థానిక వ్యాపారస్తుల నిర్లక్ష్యం కారణంగా దుర్గంధం వెదజల్లుతుంది. స్థానికంగా చికెన్, చేపల వ్యాపారం చేసే వారు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వారు ఆయా వ్యర్థాలను మండలకేంద్ర ప్రవేశం వద్ద విచ్చలవిడిగా పడేయడంతో పాటు కోళ్ళ కలేభారాలు, కుళ్లిపోయిన కోడి గుడ్లు వంటి దుర్గంధ వ్యర్థాలను కూడా రోడ్డు పక్కనే పడేయడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతుంది. ఈ దుర్వాసన భరించలేక స్థానిక ప్రజలు ముక్కులు మూసుకుంటున్నారు. ప్రయాణికులు ఆ ప్రాంతానికి అర కి.మీ ముందే ముక్కులు మూసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది. ఇదే విషయమై వ్యాపారస్తులు కోళ్లు, చేపల వ్యర్థాలను అక్కడ పడేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు పలుమార్లు మండల, పంచాయతీ అధికారుల వద్ద మొరపెట్టుకున్నా... అయినా అధికారులు దృష్టి సారించక పోవడంతో ఆ ప్రదేశం పూర్తిగా డంపింగ్ యార్డులా మారింది. ఇదే మార్గంలో మండల అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వారు సైతం ముక్కులు మూసుకుని వెళ్తున్నారే తప్ప సమస్య వైపు చూడడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఎయిర్‌పోర్టు భూముల రైతులకు గుడ్‌న్యూస్

**- ఎకరాకు 16లక్షలు చెల్లించేలా సిఎం చంద్రబాబు ఆదేశాలు**



కుప్పం, మే 23 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలో డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు నిర్మించాలని సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయించిన విషయం విదితమే. ఇందుకు గాను సుమారు 1200 ఎకరాల భూములు అవసరం అవుతాయని అధికార యంత్రాంగం అంచనా వేశారు. 2019లోనే సిఎం చంద్రబాబునాయుడు కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు శంకుస్థాపన చేసి 100 కోట్ల నిధులు సైతం అప్పట్లో మంజూరు చేశారు. అదే సమయంలో దాదాపు 500 ఎకరాల దాకా భూసేకరణ చేపట్టి రైతులకు పరిహారం సైతం అందించారు. మరో 15 కోట్ల దాకా రైతులకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. తదనంతరం వైఎస్సార్సీ ప్రభుత్వం అధికారంలో రావడంతో కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం, నిధులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. అయితే గతేడాది జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంతో పాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టాక ఎయిర్‌పోర్టు అంశం మరలా తెరపై వచ్చింది. శాంతిపురం - రామకుప్పం మండలాల మధ్యలో విజలాపురం, కిలాక్‌పోడు, అమ్మవారి పేట గ్రామాల సమీపంలో ఎయిర్‌పోర్టుకు గతంలో సేకరించిన భూముల ప్రాంతంలోనే అదనంగా మరో 600-700 ఎకరాల భూసేకరణ చేపడితే డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు నిర్మాణం భూములు సరిపోతాయని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇటీవలే అధికార యంత్రాంగం ఎయిర్‌పోర్టు నిర్మాణంకు అవసరమైన భూములను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. ఈ నేపథ్యంలో కొంతమంది రైతులు తమకు చాలా తక్కువ విస్తీర్ణంలో భూములు ఉన్నాయని ఆ భూములు కోల్పోతే నష్టపోతామని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌ల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడుతో మాట్లాడి ప్రభుత్వం తరఫున మంచి పరిహారం అందిస్తామని రైతులతో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం కుప్పంకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు ఎయిర్‌పోర్టు నిర్మాణంకు సంబంధించి భూసేకరణ చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించిన విషయం విదితమే. ఈ సమయంలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ ఎయిర్‌పోర్టు రైతుల గురించి సిఎంతో చర్చించారు. ప్రస్తుతం ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత భూములకు మార్కెట్ ధర ఎకరాకు 5లక్షలు ఉందని అయితే కుప్పం ప్రాంత రైతుల సౌకర్యార్థం భూసేకరణ చేసే ప్రతి ఎకరాకు ప్రభుత్వం తరఫున 16లక్షల రూపాయలు ఇచ్చేలా సిఎం చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు భూములు ఇచ్చే రైతులకు ఇది శుభవార్తే. ప్రభుత్వం తరఫున పరిహారం సైతం ఖరారు అయిన నేపథ్యంలో త్వరలోనే రైతుల నుంచి భూసేకరణకు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు. మరో పక్క సాధ్యమైనంత త్వరగా కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలని సిఎం చంద్రబాబునాయుడు సైతం కృషి చేస్తున్నారు.

## నవయుగచే కారు బహూకరణ



శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి నిత్యభక్తులుగా ఉన్న నవయుగ కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు శుక్రవారం దేవస్థానానికి కారును బహూకరించారు. గతంలో రాజగోపురాన్ని నిర్మించిన వారు లోక కళ్యాణార్థం శాంతి హోమాలను నిర్వహించారు. సుమారు రూ.70కోట్లు వెచ్చించి రాజగోపురాన్ని నిర్మించి తలమానికంగా మారింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆలయ దర్శనానికి వచ్చినపుడు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డితో చర్చిస్తూ కారును బహూకరించుటకు నిర్ణయించారు. దాంతో ఆ కారును శుక్రవారం ఆలయానికి అప్పగించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ బాపిరెడ్డితో పాటు ఇఇ మురళీధర్‌రెడ్డి, డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ కారును దేవస్థానం డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డికి కేటాయించినట్లు తెలిసింది.

## ట్రాయ్ కాగ్ సభ్యుడిగా చిట్టిబాబు



తిరుపతి కలెక్టరేట్, మే 23 ప్రభాతవార్త : టెలికాం రెగ్యులేటరీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) న్యూఢిల్లీ నుంచి సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ నంద కిషోర్ చౌదరి నుంచి ఆర్డర్స్ తీసుకోవడం జరిగిందని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల పరిధిలోని టెలికాం వినియోగదారుల సమస్యల పరిష్కరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ట్రాయ్ కాగ్ మెంబర్ పి. చిట్టిబాబు తెలిపారు. నేటి ఆధునిక యుగంలో కమ్యూనికేషన్ వ్యవస్థను బలిపీఠం చేయడంతో పాటు టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న తరుణంలో వినియోగదారులకు సదస్సులు సమావేశాలు నిర్వహిస్తున్నామని, బలోపేతం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా కేబుల్ ప్రసారాల వ్యవస్థతో పాటు ప్రభుత్వ రంగ సంస్థ అయిన టెలికాం, కార్పొరేట్ టెలికాం కంపెనీస్ నుంచి సేవలు పొందుతున్న కోట్లాది మంది వినియోగదారులకు సూచనలు, సలహాలను మెరుగైన సేవలను అందించేందుకు అవకాశం కల్పించారన్నారు. 2015 నుంచి ట్రాయ్ కాగ్ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పుడు తిరిగి 2015 నుంచి రెండు సంవత్సరాలు ఇందులో కొనసాగుతారన్నారని తెలిపారు.

**తిరుమలలో మద్యం మత్తులో...**

## ఏపిఎస్‌పి బెటాలియన్ పోలీసులు

తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి: కంచే చేనుమేసిన చందంగా శాంతిభద్రతలు కాపాడటం, పవిత్రంగా ఆలయం భద్రత విధుల్లో ఉండే ఏపిఎస్‌పి పోలీసులు ముగ్గురు మద్యంసేవించి మత్తులో హంగామా సృష్టించారు. అంతేగాక వాహనంతో ఢీకొని అభాసుపాలయ్యారు. ఈ సంఘటన తాజాగా శుక్రవారం రాత్రి తిరుమలలో జరిగింది. తిరుమలలో ఆలయం పైభాగంలో, ఆలయం ముందు,గొల్లమండపంపై ఏపిఎస్‌పి బెటాలియన్ పోలీసులు భద్రత విధులు నిర్వహిస్తారు. శుక్రవారం సాయంత్రం ముగ్గురు ఏపిఎస్‌పి పోలీసులు కర్నూలుకు చెందిన బి.రాజశేఖర్, కె.ఓంకార్‌నాయక్, షేక్ సిరాజుద్దీన్ ఉన్నారు. వీరిలో సిరాజుద్దీన్ తప్పించుకోగా మిగిలిన ఇద్దరిని తిరుమల 2టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైద్యపరీక్షలు చేయగా బ్రీత్‌అనలైజర్‌లో 300ప్లస్ పాయింట్లు నమోదైందని పోలీసులు తెలిపారు.

## బయట తినాలంటేనే భయమేస్తోంది!

**తిరుపతిలో హోటళ్ళలో అపరిశుభ్ర వాతావరణం -పట్టించుకోని పుడ్‌సేఫ్టీ అధికారులు**

**ప్రభాతవార్త-తిరుపతి:**



తిరుపతికి వస్తున్న యాత్రికులతోబాటు నగరవాసులు ఏదో ఏ హోటల్‌కు,పాస్ట్‌పుడ్ సెంటర్‌కు వెళ్ళి,తోపుడుబండ్లపై కొరిన టిఫిన్, భోజనం, చైనీస్‌పుడ్‌తినాలంటేనే భయపడాల్సిన పరిస్థితి వస్తోంది. హోటళ్ళులో, మెస్‌లలో అపరిశుభ్ర వాతావరణం ఆందోళన కలిగిస్తోంది. గతంలో తిరుపతిలోని పలు హోటళ్లలో పుడ్‌సేఫ్టీఅధికారులు, నగరపాలక ఆరోగ్యవిభాగంఅధికారులు దాడులు చేసినపుడు చాలావరకు హోటళ్లలో వంటగదులు అపరిశుభ్రంగా ఉండటం, నాణ్యతలేని కూరగాయలు, కుళ్లిన కూరగాయలు ఉండటం తెలిసిందే. కూరగాయలు సరిగా నిల్వచేయలేదని జిల్లా వినియోగదారుల సంఘం కూడా గుర్తించింది. దీంతో యాత్రాస్థలం తిరుపతినగరంలోని అనేక హోటళ్లలో భోజనం చేయాలన్నా, టిఫిన్ తినాలన్నా యాత్రికులు జడుసుకుంటున్నారు. ఇక్కడ పరిశుభ్రతకు తావిచ్చి నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాల్సిన అవసరం హోటళ్ళ యాజమాన్యంకు ఉంది. అయితే వ్యాపారమే లాభంగా చేసుకుని ఇష్టానుసారంగా హోటళ్ళ నిర్వహణ ఉండటం, కిచెన్‌లు ,వంటచేసే స్టౌలు అపరిశుభ్రంగా రోడ్డుపై ధుమ్ము,చెత్త ఎగిరిపడేలా వంటలు చేస్తుంటారు. ఇలాంటివి ఆర్టీసి బస్టాండు, రైల్వేస్టేషన్, , టిపి ఏరియా, భవానీనగర్, తిరుమల బైపాస్‌రోడ్డు, ఆర్‌సిరోడ్డు,ఎంఆర్‌పల్లి ప్రాంతాల్లో దాదాపు వందకుపైగా హోటళ్ళు ఉన్నాయి. ఇవేగాక తోపుడుబండ్లు కూడా టిఫిన్,గోబీరైస్ వంటివి విక్రయిస్తుంటారు. నగరంలో చాలావరకు హోటళ్ళు, ఫాస్ట్‌పుడ్ కేంద్రాలన్నీ అపరిశుభ్ర వాతావరణంలోనే కనిపిస్తుంటాయి. మరీ కొన్ని హోటళ్ళులో స్టౌలు రోడ్డుముందుకు పెట్టి అవసరమైన ఆహారం గోబీప్రైడ్ రైస్, వెజ్‌రైస్,టిఫిన్ లు,దోసలు, పూరీలు తయారుచేస్తుండటం కనిపిస్తుంది. మరీ రైల్వేస్టేషన్, విష్ణునివాసం ప్రాంతాల్లోని అనేక హోటళ్ళు అపరిశుభ్రవాతావరణంలోనే నడుస్తున్నాయంటే ఆశ్చర్యం లేదు. కొన్ని హోటళ్లలో కూరగాయలు కూడా సరిగ్గా నిల్వచేయట్లేదనేది ఆరోపణలు. భోజనం చేయాలంటే వంద రూపాయలు టిఫిన్ తినాలన్నా 60,70రూపాయలు వెచ్చించినా నాణ్యమైన ఆహారమేనా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరీ తిరుపతికి రోజుకు 50వేలమంది యాత్రికులు వస్తున్నారు. వీరిలో చాలావరకు రైళ్ళలో,, బస్సుల్లో వస్తుండటంతో ఉదయం సమీపంలోని హోటళ్లలో టిఫిన్ చేయాలన్నా, సాయంత్రం ఇష్టమొచ్చిన ఫాస్టుపుడ్ తినాలన్నా యాత్రికులు భయపడుతున్నారు. నగరపాలకసంస్థ ఆరోగ్యశాఖ కూడా కనీసం హోటళ్ళలో పరిశుభ్రతపై తనిఖీలు చేయడం మరచిపోయారనేది విమర్శలు. మరీ తిరుపతి యాత్రాస్థలంలో నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించేందుకు పుడ్‌సేఫ్టీ అధికారులు, నగరపాలక ఆరోగ్యవిభాగం ఎలాంటి చర్యలు తీసుకుంటారోంది చూడాలి.

## శివయ్యకు 100 గ్రైండర్లు బహూకరణ



శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరునికి విరాళాలు అందించే భక్తులు రోజు రోజుకు పెరుగుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నెల్లూరుజిల్లాకు చెందిన భక్తులు వంద గ్రైండర్లను వితరణ చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని సందర్శించుకున్న వారు గతంలో ప్రసాదం పోటు లో పరిశీలించిన పుడు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించారు. దాంతో వంద గ్రౌండర్లు విలువ రూ.91 వేలు అలాగే లడ్డు పులిహోరను బ్యాంకుకౌంటర్లకు తరలించేందుకు ట్రేలను అందించారు. నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం పూడిపర్తి గ్రామానికి చెందిన సారంగం రామచంద్రయ్య, సారంగం ప్రమీలమ్మ అనేభక్తులు విరాళంగా అందించారు. వాటిని డెప్యూటి ఇఓఎన్ఆర్ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్‌ల సమక్షంలో అందజేసారు.



తిరుపతి పార్లమెంట్ మహానాడులో పాల్గొన్న జోన్ కోఆర్డినేటర్ దీపక్‌రెడ్డి, సోమిరెడ్డి, యాదవసంక్షేమ సంఘం ఛైర్మన్ నరసింహయాదవ్, ఇన్‌ఛార్జి సుగుణమ్మ, రాష్ట్రకార్యదర్శి వి.పుష్పావతియాదవ్ తదితరులు – ప్రభాతవార్త-తిరుపతి